# నిధి చాల సుఖమా

వసుంధర



**పేరులోనే పెన్నిధి ఉందని నమ్మే మా నాన్న తనకు మా తాత గారు అంటే చెప్పలేనంత ఇష్టమని ఆయన పేరే నాకు పెట్టాలనుకున్నాడు. రాముడి పేరుకు కష్టాలతో లింకుందని, ఆ పేరులోంచి రాముడి పేరు తొలగించి నాకు ఉత్త కృష్ణ అనే పేరుపెట్టాడు. నేను కృష్ణుడిలా అంగరంగ వైభోగంగా జీవించాలన్నది ఆయన సత్సంకల్పం.**

చిన్నప్పట్నించీ కృష్ణుడి కథలువింటూ, లీలలు తెలుసుకుంటూ పెరిగాను. మరి వాటి ప్రభావమో లేక నా సహజ గుణమో కానీ చిన్నప్పట్నించీ నేను కాస్త డిఫరెంటు.

నాలుగేళ్ళ వయసప్పుడు సుభద్రమ్మ అనే యాభై ఏళ్ళావిడ నన్ను చూసి ముచ్చటపడి ఒళ్ళో కూర్చోబెట్టుకుని ''చాలా బాగున్నావురా. నన్ను పెళ్ళిచేసుకుంటావా'' అంటే నేను చటుక్కున లేచి నిలబడి ఆవిణ్ణి ముద్దుపెట్టుకున్నాను. అంతే.. అంత పెద్దావిడా సిగ్గుపడిపోయి అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయి, ''పిల్లల ముందు కాస్తజాగ్రత్తగా మసలుకోండి. వాళ్ళకు అన్నీ తెలుస్తున్నాయి'' అని అమ్మను మందలించింది. విషయం విని ''చిన్నపిల్లాడు . ముద్దుపెడితే తప్పేమిటమ్మా'' అంది అమ్మ.

''వాడు చిన్నపిల్లాడిలా ముద్దుపెట్టలేదు. పెద్దాళ్ళను చూసి నేర్చుకున్నట్లుంది''అందావిడ.

అప్పుడు నేను వాళ్ళిద్దరి మధ్యకూ వెళ్ళి ''అంటే పెద్దాళ్ళు కూడా ఒకర్నొకరు ముద్దెట్టుకుంటారా?'' అని ఆశ్చర్యంగా అడిగాను. అమ్మ నాకు బదులివ్వకుండా ''మా చేతలకంటే నీ మాటలే వాడికి నేర్పకూడనివి నేర్పుతున్నాయి సుభద్రమ్మా'' అని ఆవిణ్ణి హెచ్చరించింది. ఆ తర్వాత వాళ్ళు నాకు వినపడకుండా ఏమేమో మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు ఓ అరవై ఏళ్ల సూర్యకాంతమ్మగారు ఓ రోజున నేను నిద్రలేచేసరికి అప్పుడే

స్నానం చేసొచ్చి చీర కట్టుకుంటూ నేను లేచి కూర్చోవడం గమనించి నాకేసి చూసి కెవ్వుమని చుట్టబెట్టుకున్న చీరతో బాత్రూంలోకి పరుగెత్తింది. తర్వాత అమ్మతో "గుంటవెధవ నిద్దరోతున్నాడనుకున్నాను. చీర కట్టుకుంటూండగా ఠక్కున లేచి కూర్చున్నాడు" అందావిడ.

"గుంటవెధవే కదా. చూస్తే తప్పేముంది?" అంది అమ్మ.

"అలాగనుకునే ధైర్యంగా చీరకట్టుకున్నాను. కానీ వాడి చూపులు చిన్నపిల్లాడి చూపుల్లా లేవు. అచ్చం మా ఆయన చూపుల్లా ఉన్నాయి" అందావిడ.

నా చూపులు నాకు శాపమవడం అదే మొదలు. ఆడాళ్ళు కనిపిస్తే చాలు పెద్దవి చేసి చూస్తాను. కొందరు కెవ్వుమంటారు. కొందరు చీదరించుకుంటారు. కొందరు అమ్మ పెంపకాన్ని తప్పుపడతారు.

ఒక్కరూ నన్ను ఇష్టపడరు.

మరి మా ఇంట్లోనూ బామ్మ, అమ్మ, అక్క, చెల్లి, పిన్ని, పిన్ని కూతురు వగైరా ఆడాళ్ళున్నారు. వాళ్ళకి నా చూపులు బాగానే వుంటాయి. అంటే ఆడాళ్ళలో మనవాళ్ళూ, పరాయివాళ్ళూ వేరని గ్రహించి, మొదటిసారి మాధవి మా ఇంటికొచ్చినప్పుడు తప్పించుకు తిరిగాను.

మా ఎదురింట్లో కొత్తగా వచ్చింది మాధవి కుటుంబం. వచ్చిన మర్నాడే ఆ అమ్మాయి కలుపుగోలుగా మా ఇంటికొచ్చి ఇంట్లో అందరితో స్నేహం చేసుకుంది. మా వాళ్ళు నా గురించి ఏం చెప్పారో గానీ తప్పించుకు తిరుగుతున్న నా దగ్గరకు వెతుక్కుంటూ వచ్చి " ఏయ్ ఆడపిల్లలా అలా సిగ్గుపడతావేం?" అంటూ పలకరించింది.

"ఆడపిల్లలాకాదు, నువ్వు ఆడపిల్లవని సిగ్గుపడుతున్నాను" అన్నాను తలొంచుకునే.

ఆమె నవ్వి "నీకు నాలుగు, నాకు పదహారు. నువ్వు నన్ను ఆడపిల్ల అనకు. నా దగ్గర సిగ్గుపడకు. ఈరోజు నుంచీ మనిద్దరం స్నేహితులం. సరేనా!" అంది తియ్యని గొంతుతో. అప్పుడు నాకు ధైర్యమొచ్చి తలెత్తి చూస్తే ఆమె చాలా అందంగా ఉంది. అప్పుడు నా కళ్ళు పెద్దవైతే మిగతా ఆడాళ్ళలా కెవ్వుమనక నవ్వేసి షేక్‌హేండిచ్చి వెళ్ళింది.

ఆ తర్వాత ఓసారి వాళ్ళ వాళ్ళంతా ఎక్కడికో వెడితే కాలేజి మాననని ఇంట్లో మాధవి ఒక్కతే వుంది. రాత్రిపూట సాయంగా పడుకుందుకు అమ్మనడిగి వాళ్ళింటికి తీసుకెళ్ళి చాలాసేపు నాకు మంచి మంచి కథలు చెప్పింది. నేను ఇంకా ఇంకా చెప్పమంటే "నీకు కథలంటే చాలా ఇష్టమా?" అనడిగింది.

"ఔను కథలంటే ఇంతిష్టం" అంటూ నా రెండు చేతుల్నీ బార్లా జాపి చూపించాను.

ఆమె ముచ్చటపడి నాకింకా ఏమిష్టమో, ఎవరిష్టమో, ఎంతిష్టమో చూపించాను.

నేను ఎక్కువ ఇష్టానికి ఎక్కువగానూ, తక్కువ ఇష్టానికి తక్కువగానూ చేతులు బార్లా జాపుతూ అమ్మమీద ఇష్టం చెప్పడానికి మాత్రం చేతులింకా చాపలేక అవస్థ పడుతూనే ఆమె చటుక్కున "మరి నేనంటే?" అంది.

అమ్మ అలా అడిగితే బుగ్గమీద గట్టిగా ముద్దుపెడతాను. మాధవి అన్నా నాకు చాలా ఇష్టం కదా "ఇంతిష్టం" అంటూ చటుక్కున ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాను. తెల్లబోయిన మాధవి తేరుకోగానే పక్కకు తోసి "నీకు బుద్ధుందా? ఇదేంపని?" అని తిట్టింది.

నేను చిన్నబుచ్చుకుని "నువ్వడిగితే కదా చెప్పాను? మరి మా అమ్మ ఎంతిష్టమని అడిగినప్పుడు ముద్దుపెడితే నవ్వుతుందే కానీ విసుక్కోదు" అన్నాను.

"నువ్వు మీ అమ్మక్కూడా ఇలాగే ముద్దుపెడతావా?" ఆశ్చర్యంగా అడిగింది మాధవి.

"అమ్మకైతే బుగ్గమీద ముద్దు పెడతా. మరి నీతో ఇలాగే బాగుంటుందనిపించింది" అన్నాను.

"ఇలా తప్పు. ఎవరికైనా సరే ముద్దు బుగ్గమీదే పెట్టాలి" అని మాధవి మందలిస్తే నిజమేననుకుని సారీ కూడా చెప్పాను. అప్పుడు, "సరేలే" అంటూ ఆమె నాకు దుప్పటి కప్పి ఆ మంచం పక్కనే మడత మంచం వేసుకుని పడుకుంది. నేనాశ్చర్యపడి " ఈ మంచం పెద్దదేగా– ఇంతసేపూ ఇద్దరం సరిపోయాముగా" అన్నాను. బదులుగా ఆమె " ఆడపిల్లలు అబ్బాయిలకు కాస్త దూరంగా ఉండాలిలే" అంటే కామోసనుకుని పడుకున్నాను. మంచి నిద్రపట్టేసింది.

**అప్పుడు మాధవి నాకో సీక్రెట్ చెప్పింది. చిన్నపిల్లలు పెద్దవాళ్ళకి అలా ముద్దు పెట్టడం తప్పుకానీ పెద్దవాళ్ళు పెద్దవాళ్ళకి అలా ముద్దు పెట్టొచ్చుట. ఐతే ఎవరూ చూడనప్పుడే అలాంటి ముద్దు పెట్టొచ్చుట. ఒకవేళ ఎవరైనా చూస్తే అది రహస్యంగా ఉంచాలిట.**

తెల్లారేక కాలింగ్‌బెల్ చప్పుడు వినపడి మెలకువొచ్చి కళ్ళు తెరిస్తే అప్పటికే లేచి బ్రష్ చేసుకునొచ్చి కూర్చుని క్లాసు పుస్తకం చదువుకుంటున్న మాధవి డ్రెస్సింగ్‌టేబుల్ అద్దంలో కనిపించింది. నేను దుప్పటి ముఖమంతా కప్పుకుని కాస్త సందు చేసుకుని బద్ధకంగా మాధవినే చూస్తున్నాను.

"ఇంతపొద్దునే ఎవరు చెప్మా?" అని గొణుక్కుంటూ లేచి వెళ్ళింది మాధవి. తలుపు తీయడం, వేయడం, ఇద్దరు మాట్లాడుకుంటూ గదిలోకి రావడం తెలిసింది. అద్దంలో మాధవి, ఆమె పక్కన ఓ యువకుడూ కనిపించారు. ఇక లేద్దామా అనుకుంటూండగా ఆ యువకుడు " ఇంకో గంటలో వస్తామని కబురు చెప్పమన్నాడు మామయ్య. నీతో కాసేపు ఏకాంతం దొరుకుతుందని సరేనన్నాను" అంటూ మాధవి చేయి పట్టుకున్నాడు.

" ఇష్.. గదిలో కృష్ణ వున్నాడు" అంటూ విడిపించుకోబోయిందామె.

"వాడెవడు.. నాకు విలనా?" అన్నాడు మాధవి బావ.

వెంటనే నేను బిగుసుకు పోయాను. మా యింట్లో అమ్మా నాన్నా నాగురించి మాట్లాడుకునేవి వినాలనుకున్నప్పుడు దొంగనిద్ర నటించడం అలవాటే నాకు.

"నీ విలన్ వయసు నాలుగేళ్ళు" అందామె నవ్వుతూ.

అంతే– "నాలుగేళ్ళా ఐతే ఓకే" అంటూ బావ మాధవికి చటుక్కున ముద్దుపెట్టాడు అచ్చం నాకు లాగే.

తోసేసి తిట్టేస్తుందనుకున్నాను కానీ ఆమె అతణ్ణి మృదువుగా విడిపించుకుని "నీకింత తొందర పనికి రాదు బావా" అంది.

"ముద్దుక్కూడా తొందర తప్పేనను. ఇంకెప్పుడూ నీకు ముద్దుపెట్టను" అన్నాడు బావ.

"సరేలే. ఈ తొందర తప్పుకాదు" అంది మాధవి.

నాతో ఇంకోలా చెప్పి బావతో అలా అన్నందుకు ఆశ్చర్యపోయాను. కానీ అంతకంటే ఆశ్చర్యపోయే సంఘటన ఆవెంటనే జరిగింది.

"మాటలో చెబితే నా కోపం పోదు. చేతల్లో చెప్పాలి" అన్నాడు మాధవి బావ. అంతే వెంటనే మాధవి కూడా వాళ్ళ బావకు ముద్దుపెట్టింది. తనూ అచ్చం నాకులాగే.

నాకిక కోపం ఆగలేదు. చటుక్కున లేచి కూర్చుని వాళ్ళవైపు తిరిగి "అద్దంలో అంతా చూసాను. నువ్వు నాకు చెప్పిందేమిటి చేస్తున్నదేమిటి?" అంటూ మాధవిని గద్దించాను.

ఇద్దరూ విడిపోయి ఓ క్షణం నావంక భయంభయంగా చూసారు. ఆ వెంటనే బావ అక్కణ్ణించి తప్పుకున్నాడు. మాధవి నన్ను సమీపించి నెమ్మదిగా అనునయించబోయింది.

"నువ్వునాకు అబద్ధం చెప్పావ్" అన్నాను కోపంగా.

అప్పుడు మాధవి నాకో సీక్రెట్ చెప్పింది. చిన్నపిల్లలు పెద్దవాళ్ళకి అలా ముద్దుపెట్టడం తప్పుకానీ పెద్దవాళ్ళు పెద్దవాళ్ళకి అలా ముద్దు పెట్టొచ్చుట. ఐతే ఎవరూ చూడనప్పుడే అలాంటి ముద్దు పెట్టొచ్చుట. ఒకవేళ ఎవరైనా చూస్తే అది రహస్యంగా ఉంచాలిట.

"సరేలే. నీ బావంత పెద్దయ్యేకే నీకలా ముద్దు పెడతాను" అని ఆమెకు హామీ ఇచ్చాను.

ఆ తర్వాతనుంచి మాధవి నాక్కాస్త దూరంగా ఉండేది. నా ముద్దే అందుక్కారణమని అప్పుడనుకున్నాను కానీ, ఆమె ఆ తర్వాత నాలుగేళ్ళకు నాకు లాగే ముద్దుపెట్టిన బావను ఇష్టపడి సంతోషంగా పెళ్ళిచేసుకుంది. ఏమిటో ఈ ఆడపిల్లలు మరి!

ఐదో ఏట స్కూల్లో చేరాను. అక్కడ లేడీటీచర్లు నన్ను "అలా చూస్తావేం?" అని మందలించేవారు. అది చూసో ఏమో నాతో చదివే అమ్మాయిలు కూడా అలాగే అనేవారు. ఇంట్లో చెబితే స్కూల్ మార్చేస్తారని భయపడ్డాను కానీ నాకు పదేళ్ళొచ్చేసరికి ఆ స్కూల్ వాళ్ళే నన్ను బాయ్స్ స్కూల్‌కి మార్చమన్నారు. అక్కడా లేడీటీచర్లు నా చూపులకు యిబ్బం

దిపడ్డారు. అలాగే టెన్త్‌లోకి వచ్చాను. అప్పటికి నాకు కాస్త లోకజ్ఞానం కలిగింది.

స్త్రీపురుషులకు శృంగారపరమైన పరస్పరాకర్షణ ప్రకృతి సహజం. అది నాలో మోతాదు కాస్త మించిందేమో.. మనసు, తనువు శృంగారానికి అనువుకాని రోజుల్లో కూడా నా చూపుల్లో శృంగారభావముండేది. అనుభజ్ఞులకది అర్థమై కలవరపడేవారు. అనుభవం చాలని మాధవి నేనంటే ముచ్చటపడి స్నేహం చేస్తే, నా ముద్దు ఆ స్నేహాన్ని దెబ్బతీసింది. ఎందుకంటే శృంగారానికి సంబంధించి బావకు మాత్రమే కట్టుబడిందామె. మరి నేనలా కాదు. మా ఇంట్లో వాళ్ళను తప్పించి మరే ఆడపిల్లను చూసినా నాకేమో ఔతుంది. అది తప్పు అనుకున్నాను కానీ కాదని గుడిలో పురాణం విన్నాక అనిపించింది.

మా వీధిలోనే ఉన్న గుడిలో ఓ పండితుడు నెల్లాళ్ళ పాటు భాగవతంలోని శ్రీకృష్ణుడి కథను పురాణపఠనం చేసాడు. బామ్మ అది వినడానికి వెడుతూ నన్ను తోడు రమ్మంది. ముందు గొణిగాను కానీ తర్వాత వెళ్ళాను. మరి నన్ను ఇంట్లో అందరికంటే ఎక్కువగా ముద్దుచేసే బామ్మపట్ల కృతజ్ఞత చూపాలి కదా. మంచి చేస్తే మంచి జరుగుతుంది. అలా వెళ్ళడం వల్ల అంత కాలం తప్పనుకుంటున్నవన్నీ శ్రీకృష్ణుడి బుద్ధులని అప్పుడేనాకు తెలిసింది. శ్రీకృష్ణుడు ఎందరో ఆడప్లిలలతోసంబంధం పెట్టుకుంటే, పండితుడా వ్యవహారాన్ని రాసలీల, వేదాంత హేల అంటూ పొగుడుతూంటే బామ్మతో సహా అక్కడ చేరినవారంతా పరవశించి విన్నారు. మరి వాళ్ళు నాగురించి పరవశించరెందుకో అనుకున్నా. ఎందరికో ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుడి బుద్ధులే నావని మురిసిపోయాను.

బాయ్స్ స్కూల్లో ఉండగా అమ్మాయిల దర్శనానికే మొహం వాచిపోయాను కానీ కాలేజీలో చేరాక అమ్మాయిలే అమ్మాయిలు. పైగా వాళ్ళు తమకు తామై 'హాయ్' అంటూ పలకరించే టైపు. నేనక్కడ అమ్మాయిల చుట్టూ ఎంతగా తిరిగానంటే అబ్బాయిలంతా ఇంచుమించుగా నన్ను వెలేసారు. అబ్బాయిలతోనాకు పనేంటిలే అనుకుని పట్టించుకోలేదు. కానీ తొందరలోనే చాలామంది అమ్మాయిలు నా చూపులకే జడిసిపోయి నన్ను దూరంగా వుంచారు. నా చూపులకు జడవని అమ్మాయిలూ వున్నారు కానీ వాళ్ళు నేను తమకే కట్టుబడాలన్నారు. రాధతో మాట్లాడుతుండగా శ్రావ్య వస్తే ఆమెను చూసి నాకళ్ళు పెద్దవైతే రాధకు కోపం. అలా శ్రావ్యకు యమున కోపం తెప్పిస్తే యమునకు సీత. ఒక్కరికే కట్టుబడని శ్రీకృష్ణుణ్ణి ఆరాధించే అమ్మాయిలు తమ ప్రియుడు మాత్రం ఒక్కరికే కట్టుబడాలని ఎందుకనుకుంటారో తెలియదుకానీ క్రమంగా అందరమ్మాయిలూ దూరమై ఇంటర్ పూర్తయ్యేలోగానే కాలేజీలో నేను ఒంటరినైపోయాను. ఓసారి జాలిపడి పలకరించిన కమలా మేడమ్ కూడా నాచూపులకు జడుసుకుని మళ్ళీ నన్ను పలకరించలేదు.

డబ్బుకోసం దగ్గరయ్యే అమ్మాయిలూ వున్నారు. వాళ్ళలోనూ అందగత్తెలున్నారు. కానీ ఎక్కడ చూసినా ఎయిడ్సు గురించి ముమ్మరంగా సాగే ప్రచారం. ఏ సుఖం లేకపోతే జీవితముండదనుకున్నానో ఆ సుఖం జీవితమే లేకుండా చెయ్యకూడదు కదా.

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసేసరికి నాకు డిప్రెషన్ వచ్చింది. మా ఫ్యామిలీ డాక్టరు సైకాలజిస్టుకి చూపించమన్నాడు. కానీ పిచ్చిపట్టినవాళ్ళే సైకాలజిస్ట్ వద్దకు వెడతారని నాన్న నమ్మకం. నన్నాయన తను గుడ్డిగా నమ్మే ఆనందయోగి వద్దకు తీసుకెళుతున్నాడు.

ఆనందయోగి మా ఊళ్ళో ఆనందాశ్రమం నడుపుతున్నాడు. ఆధ్యాత్మిక బోధనలకు ప్రాధాన్యమిచ్చే ఆశ్రమంలో ఎందరో మానసిక రోగులు స్వస్థులయ్యారంటారు.

ఆశ్రమంలో చేరిన మొదటిరోజునే ఆనందయోగి నన్ను పిలిచి రకరకాల ప్రశ్నలు వేసి నా మనోభావాలు తెలుసుకుని ''నీకు తెలివుంది. మంచి భవిష్యత్తుంది. ఎటొచ్చీ తప్పుదారిలో ఉన్న నీ ఆలోచనల్ని సరైన మార్గంలో పెట్టాలి'' అన్నాడు.

> **''సరే.. అయితే నువ్వు కృష్ణయోగిగా వెళ్ళు. అక్కడ సంతానం కోరే స్త్రీలెందరో ఉన్నారు. వాళ్ళు సంతానం కోసం యోగులకు మనస్ఫూర్తిగా శీలాన్నర్పిస్తారు. కానీ అందుకు షరతులున్నాయి. ఏ యువతికి సంతానం కావాలో ఆమెతోనే నీవు సంగమించాలి. ఆమె కూడా తనంతట తనే నీవద్దకు రావాలి''**

''తప్పో ఒప్పో గీతాబోధన చేసిన శ్రీకృష్ణుడి దారిలోనే వున్నాయి నా ఆలోచనలు'' అన్నాను.

''నీమీద నీపేరు ప్రభావం చాలా ఎక్కువగా వుంది. మీ తాతగారి పేరులో కృష్ణ తీసేసి రామ ఒక్కటే పెట్టుకో. సుఖపడతావు'' అన్నాడాయన.

ఆయన నా బుద్ధులు మార్చుకోమని పరోక్షంగా చెప్పినట్లు అర్థంకాక, ''రాముడి పేరులో పెన్నిధి లేదు. నాక్కావాల్సిన సుఖాలన్నీ కృష్ణుడి పేర్లోనే వున్నాయి. ఆ పేరే నా పెన్నిధి'' అన్నాను.

ఆనందయోగి నవ్వి, ''అలా అనుకోవడమే తప్పు. కేవలం నిధికి దాసులయ్యే అమ్మాయిలు విషకన్యలని నీకూ తెలుసు. అలాకాక నీ పేరులోనే పెన్నిధి చూసేవారు కావాలనుకుంటే నీవు కేవలం పురుషుడివైతే చాలదు. పురుషోత్తముడివి కావాలి. అందుకు అధికారం, హోదా లలితకళా ప్రావీణ్యం, క్రీడల్లో ఔన్నత్యం సాధించాలి. మనదేశంలో నటుల ఫొటోలను పెళ్ళాడిన అమ్మాయిలున్నారు. ఇటీవలే క్రికెట్లో ధోనీ ఆటకు ముగ్ధురాలైన ఓ అమ్మాయి, 'నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా?' అని కాగితం రాసి నిస్సంకోచంగా టీవీ ప్రేక్షకులకు ప్రదర్శించింది. శ్రీకృష్ణుడికి అధికారమూ, హోదా, సకల విద్యా, క్రీడా ప్రావీణ్యమూ ఉన్నాయి. ఆడపిల్లలాయన వెంటపడ్డారే తప్ప ఆయన ఎవరి వెంటా పడలేదు. నువ్వాస్థాయికి ఎదగగలవా?'' అన్నాడు.

ఆడపిల్లను ఆకర్షించడానికి పురుషుడు కావడమే అర్హత అనుకున్న నేను ఆయన మాటలకు మరింత డిప్రెషన్‌కి గురయ్యాను. అప్పుడాయన ''కలవరపడకు. ఈ ఆశ్రమం శిక్షణలో నాలుగేళ్ళలో పురుషోత్తముడివవుతావు. ఆ తర్వాత నువ్వేం చేసినా అది లీల. నీ తప్పు నీ శత్రువులు వేసిన అపనింద. పదవిలో ఉంటే చాలు నువ్వు తరతరాలు ప్రజలకు ఆరాధ్యదైవం'' అన్నాడు.

''నాకా శిక్షణ వద్దు. ఆడపిల్లలను ఆకర్షించడానికి ఏమైనా ఉపాయం చెప్పండి'' అన్నాను.

ఆయన సాలోచనగా నావైపే చూస్తూ ''సరే.. అయితే నువ్వు కృష్ణయోగిగా మార్కాపురం వెళ్ళు., అక్కడ సంతానం కోరే స్త్రీలెందరో ఉన్నారు. వాళ్ళు సంతానం కోసం యోగులకు మనస్ఫూర్తిగా శీలాన్నర్పిస్తారు. కానీ అందుకు షరతులున్నాయి. ఏ యువతికి సంతానం కావాలో ఆమెతోనే నీవు సంగమించాలి. ఆమె కూడా తనంతట తనే నీవద్దకు రావాలి'' అన్నాడు.

అప్పుడు నాలో పుట్టిన ఉత్సాహం అంతా యింతా కాదు. చటుక్కున ఆనందయోగి కాళ్ళమీద పడి, ''నా జీవితానికి ఈ వరం చాలు'' అన్నాను. ఆయన నన్ను లేవనెత్తి '' ఇల్లలకగానే పండక్కాదు. నువ్వనుకున్నది అనుకున్నట్లు జరక్కపోవచ్చు. అప్పుడు నువ్వు దిగులు పడకూడదు. వెనక్కొచ్చి నా శిక్షణలో పురుషోత్తముడివి కావచ్చు'' అన్నాడు.

సరేనని ఆశ్రమంలో యోగాభ్యాసం మొదలెట్టాను. కొద్దినెలల్లోనే బాగా పెరిగిన గెడ్డం, మీసాలు నా ముఖానికి తేజస్సునిచ్చాయని కొందరు ఆశ్రమవాసులన్నారు. ఆ తేజస్సుతో ఆనందయోగి పనుపున మార్కాపురం వెళ్ళాను.

నాకు మార్కాపురంలో ఘనస్వాగతం లభించింది. మార్కండేశ్వరస్వామి గుడిలో ఐదు చుక్కల వైభోగాన్ని మించిన ఏసీ రూంలో వసతి ఏర్పాటైంది. అప్సరసల్లాంటి నలుగురు యువతులు నాకు సేవలు చేస్తున్నారు. వాళ్ళకు సంతానాభిలాష ఉందేమోనని ఆశపడ్డాను కానీ నన్ను సేవించి నా దీవెనలతో మంచి మొగుణ్ణి సంపాదించడం వాళ్ళ ఆశ అని తెలిసింది. అయితే అంత అందమైన ఆడపిల్లలు రోజూ అంత దగ్గరగా మసలడం నాకు బాగుంది.


మాటల సందర్భంలో ఆ యువతులు మార్కాపురం జమీందారు భార్య సుప్రజ గురించి చెప్పారు. ఆమె వయసు ఇరవై రెండు. అందంలో సినీతార. పెళ్ళై నాలుగేళ్ళైనా ఇంకా సంతానం లేదని దిగులు పడుతోంది.

అంటే సుప్రజ తప్పక నా వద్దకు రాగలదని తోచి ఉత్సాహపడ్డాను.

అదలాగుంచితే నేనున్న మార్కండేశ్వరాలయంలోని విగ్రహం శ్రీవెంకటేశ్వరునిది. అందుకే నేనాశ్చర్యపడి కారణమడిగితే బదులుగా అంతకన్నా ఆశ్చర్యకరమైన విశేషాలు బయటపడ్డాయి.

ఆ ఊరొకప్పుడు అడివిలా వుండేది. జమీందారు మార్కండేయులి ఆధ్వర్యంలో ఆ ఊరికి కాలువ, కరెంటు, స్కూలు, కాలేజీ వగైరాలొచ్చాయి. ఇంటింటికీ కుళాయిలు. ఊళ్ళో కాఫీ హోటళ్ళు, సినిమా థియేటర్లు.. ఒకటేమిటి గొప్ప గొప్ప నగరాల్లో ఉండే

ఆధునిక సదుపాయాలన్నీ అక్కడున్నాయి. కృతజ్ఞతగా ఆ ఊరివారు యాభై ఏళ్ల క్రితం ఊరికి మార్కాపురం అని పేరు మార్చారు. ఆ ఊరి కాలువ పేరు మార్కండేయ. ఆ కాలువ మీద మార్కండేయ వంతెన. హోటళ్ళు, సినిమా థియేటర్లు అన్నీ మార్కండేయ. అన్నీ ఒకరివే కాదు కాబట్టి తేడా తెలియడం కోసం మార్కండేయ 1, మార్కండేయ 2 అని నంబర్లున్నాయి. అలా ఇటీవలే ఆ ఊళ్ళో మార్కండేయ 13 బార్, మార్కండేయ 7 పార్కు వెలిసాయి. ఆ ఊళ్ళో రాముడికీ, శివుడికీ, వెంకటేశ్వరుడికీ తలో గుడీ వున్నాయి. దేవుడెవరైనా గుడిపేరు మాత్రం మార్కండేశ్వరాలయమే. ఆ ఊరి అమ్మవారు జగదాంబ గుడిని కూడా మార్కండేశ్వరాలయం అంటారు. ఇంకా మార్కండేయ చర్చి, మార్కండేయ మసీదు వగైరాలతో ఆ వూరు ఆదర్శ లౌకిక వాద ప్రాంతంగా పేరొందింది. మార్కాపురం జమీందారు మార్కండేయులికి ఒక్కడే కొడుకు. ఏ తరంలో అయినా పెద్దకొడుక్కి మార్కండేయులి పేరే ఉండాలన్న కుటుంబ సంప్రదాయం ప్రకా రం అతడి పేరూ మార్కండేయులే. జమీందారీలు పోయి నా ఆ ఊరికాయన మకుటంలేని మహారాజు. పాండవులకు శ్రీకృష్ణుడిలా ఆయనే ఊరి మేయరు, ఎమ్మెల్యే, ఎంపీ వగైరాలందరికీ తల, నాలుక. ఆ ఊళ్ళో ఆయన అభ్యర్థికి ప్రత్యర్థి ఉండడు. ఆ ఊరివారికి పార్టీలు తెలియవు. మార్కండేయులు ఏ పార్టీ అయితే వారూ అదే పార్టీ. ఇప్పుడు మార్కండేయులి వంశంలో తరానికో కొడుకు చొప్పున మూడోతరం నడుస్తున్నా ఊరివారి విధేయత ఏ దశలో ఉన్నదంటే ఆ ఊళ్ళో జమీందారు వంశం వారు తప్ప ఇంకెవ్వరూ తమ పిల్లలకు మార్కండేయులి పేరు పెట్టరు. ఊళ్ళోని మార్కండేయ విశేషాలన్నీ జమీందారు వంశానికి మాత్రమే చెందాలని ఊరివారి అభిలాష. మనదేశంలోనే మనకు తెలియనివెన్నో అనుకుంటూ, ఒకరోజు ఊరంతా తిరిగి ఎన్నో మార్కండేయ వింతలు చూశాను. అలాంటి ఊళ్ళో ఒకే ఒక్క స్థలానికి ఏ పేరూ లేకపోగా నేనాశ్చర్యపడి నాతోవచ్చిన వ్యక్తిని కారణమడిగాను.




"జమీందారు మార్కండేయులు శీలానికి ప్రాముఖ్యమిచ్చే మనిషి. మా ఊరివాళ్ళు ఆ ఇంటి ఆడవాళ్ళను దేవతలంత పవిత్రంగా భావిస్తారు. కానీ బయట్నించి వచ్చిన వాళ్ళలో రాక్షసాంశ ఉన్న కొందరా ఇంటి ఆడవాళ్ళను వక్రదృష్టితో చూసి, అందుకు ఫలితంగా రక్తం కక్కుకు చచ్చారు. అలా చచ్చిన వాళ్ళను ఈ స్థలంలో పాతిపెట్టారు. వాళ్ళకూ, వాళ్ళను పాతిపెట్టిన చోటుకీ ఏ పేరూ ఉండరాదని మా ఆశయం" అన్నాడతడు.

అప్పుడు నాకు సుప్రజ తలపుకురాగా, మోహం బదులు భయంతో వళ్ళు జలదరించింది.

మర్నాడు భక్తులు నన్ను దర్శించి తమ తమ కోర్కెలు చెప్పారు. ఆనందయోగి చెప్పిన చిట్కాలు ప్రయోగించి వారిని సంతృప్తుల్ని చేసి పంపాను. ఆతర్వాత నా వద్దకు పదిమంది యువతులొచ్చారు సంతానాభిలాషతో. వాళ్ళు నవయవ్వనంతో మిసమిసలాడిపోతూంటే నా అదృష్టానికి పొంగిపోయాను. అయితే వారిలో సుప్రజ లేదని కన్ఫర్మ్ చేసుకున్నాకే ఒక్కొక్కరికి ఒక్కొక్క రోజు గుడి ఆవరణలో నేనుండే గదిలో ఏకాంత సేవకు అపాయింట్‌మెంటిచ్చాను.

మొదటిరోజు వచ్చిన యువతి పేరు మాలతి. ఆమెకు పెళ్ళై మూడేళ్ళైంది. ఆమెను చూసి గుటకలు మింగుతూ, "నీకు మగబిడ్డ కావాలా, ఆడబిడ్డ కావాలా?" అన్నాను.

ఆమె వెంటనే "మగబిడ్డే కావాలి. కానీ ఒక్కడు కాదు, ఇద్దరు. ఒకేడాది కాదు, ఏటేటా, నాక్కాదు, మా వూరి మహారాణి సుప్రజకు" అంది.

నేను తెల్లబోయి ఏదో అనేలోగా ఆమె నా ముందు కానుకలుంచి పాదాలు స్పృశించి వెళ్లిపోయింది. ఆ రోజు మాలతి. మర్నాడు గౌరి. తర్వాత వందన. అందరిదీ ఇదే కోరిక.

పదోరోజున లావణ్య కూడా అలాగే ప్రవర్తించేసరికి ఇక ఉండబట్టలేక "మీ రాజభక్తి మెచ్చుకోతగ్గదే కానీ మీకంటూ ఏ కోరికలూ లేవా?" అనడిగాను.

"సర్వజ్ఞులు. ఇవి మా కోరికలేనని తమకు తెలియదా?" అందామె.

"సుప్రజకు ఏటేటా బిడ్డపుట్టడం మీ కోరికెందుకవుతుందో నా సర్వజ్ఞతకు తోచడం లేదు" అన్నాను.

"మా వూరు శరవేగంతో పెరిగిపోతోంది. ఈ ఊళ్ళో ఇంకా ఇంకా ఎన్నో కొత్త కట్టడాలొస్తాయి. అన్నింటికీ మార్కండేయ అన్నపేరు విసుగ్గా వుంది. మా జమీందారువంశంలో మొదటి కొడుక్కు మార్కండేయులని పేరు పెట్టడం సంప్రదాయం. ఒకరికిమించి కొడుకులుంటే తప్ప ఆ ఇంట ఇంకో పేరు పెట్టరు. ఆ ఇంట ఇంకోపేరొస్తే తప్ప మా ఊళ్ళో కొత్త కట్టడాలకు కొత్తపేర్లుండవు. అందుకని మాకోసమే ఈ ఊరి ఆడవాళ్ళమంతా ఈ కోరిక కోరుతున్నాం. ఇలా మా కోరిక సఫలం కాకపోతే అప్పుడు మహారాణి సుప్రజే స్వయంగా మీ వద్దకు రావచ్చు" అని వెళ్ళిపోయిందామె.

నాకు జ్ఞానోదయమైంది. పురుషోత్తముడి పట్ల ఆకర్షణ గురించి ఆనందయోగి చెప్పింది నిజం. అయితే ఆడపిల్లలకే కాదు, మొత్తం మనదేశ వాసులందరికీ కూడా ఆయన పేరంటేనే ఆకర్షణ.

పేరులో పెన్నిధి ఉన్నమాట నిజం. దానికోసం ఆశపడితే సుప్రజ నా వద్దకు రావచ్చు. ఆ తర్వాత నా నివాసం పేరులేని సమాధికిలోకి మారొచ్చు.

కృష్ణుని నమ్మిన వారు కృష్ణుడంతటివారు కాకుండా 'సావిరహే తవదీనా రాధా', 'రతిసుఖసారే' అంటూ శృంగారమే పెన్నిధి అనుకుంటే వారు బ్రతికున్న శవాలుగా మారి జీవితాన్నే సమాధిగా మార్చుకోవచ్చు. రాముణ్ణి నమ్మిన వారు రాముడంతటి వారు కాకపోయినా 'నిధి చాల సుఖమా' అంటూ సామాన్య జీవితంలోనే వైభోగాన్ని చూడగలరు.

పేరే మార్చుకుంటానో, ఆనందయోగి దగ్గర పురుషోత్తముడిగా మారే శిక్షణ తీసుకుంటానోగానీ, ఆ సంగతటుంచి ముందు సుప్రజ నావద్దకొచ్చేలోగా మార్కాపురం నుంచి పారిపోవాలని, గుళ్ళో ఏవో కుంటిసాకులు చెప్పి ఆ ఊరు విడిచిపెట్టాను.

★